క్లుప్తంగా

కాలనీల అభివృద్ధే లక్ష్యం

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బీఎన్ రెడ్డి నగర్ కాలనీ ఫేజ్–1 కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీటి, రోడ్లు, తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టామని త్వరలోనే వీటిని పరిష్కరిస్తామని కాలనీవాసులతో అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, నాయకులు నవీన్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఎల్‌బీనగర్: ఉచిత వైద్య శిబిరాలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని శ్రీకృష్ణదేవరాయ కాలనీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కాలనీలో తరుచూ ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్లు మృదుల, సుభాష్, నాయకులు రాజిరెడ్డి, బొమ్మర ఘురాంసేత, శ్రీధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



ఇంటింటికీ తిరిగి బొట్టు పెడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

ఎల్‌బీనగర్: తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, రోడ్లపై చెత్తను వేయకూడదని పారిశుద్ధ్య కార్మికులు ప్రజలను కోరారు. ఆదివారం బీఎన్ రెడ్డినగర్ డివిజన్‌లోని సాగర్ కాంప్లెక్స్ కాలనీ ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ అజుముద్దీన్, కాలనీ అధ్యక్షుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లు రవి గెలుపు ఖాయం'

మాడ్గుల: నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాడ్గుల మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో అధికారంలోకొచ్చామని పార్లమెంటు ఎన్నికల్లో కూడా కేంద్రంలో గెలిచి అధికారం చేపట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సరళిని చూస్తే మల్లు రవి గెలవబోతున్నట్లు ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీల పథకం పేద ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌదరిగూడ మండల పరిధిలోని రావిరాల గ్రామంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలన్నారు. భగవన్నామస్మరణతో ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, శేఖర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ్యూల్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సామ్యూల్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్యూల్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, యాదయ్య, రాములుగౌడ్, పాపయ్య, తదితరులున్నారు.

సాయం సర్వేలకే పరిమితం

నీట మునిగిన పంటలు
- వందలాది మూగజీవాల మృత్యువాత
- నాలుగేళ్లుగా అందని పరిహారం
- తప్పని ఎదురు చూపులు
- పట్టించుకోని అధికారులు



నిండుకుండలా రావిర్యాల పెద్ద చెరువు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షానికి రావిర్యాల పెద్ద చెరువు కింద చెరువు కింద పంటలు నీటమునిగాయి. మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. రైతులకు కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లింది. జరిగిన నష్టానికి ఇప్పటికీ పరిహారం అందలేదు. నియోజకవర్గంలోనే ఇది అతిపెద్ద చెరువు. ఈ చెరువులోకి మంఖాల్ అటవీ భూమి, బాగ్ మంఖాల్, చెరువు నీటితో పాటు, తుక్కుగూడ సూరం చెరువు వరద నీరు వచ్చి చేరుతుంది. ఇప్పటికీ అది నిండు కుండలా కనిపిస్తోంది. రావిర్యాల పెద్ద చెరువులో స్థానికంగా చాలా మంది రైతులకు శిఖం భూపట్టాలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి సరైన వర్షాలు లేక చెరువులో చుక్క నీరు చేరలేదు. దీంతో రైతులు వరి, కంది, పత్తి, కూరగాయలు, మూగజీవాల పోషణ తదితర పనులు చేస్తూ జీవనోపాధి పొందేవారు. 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి రాత్రికి, రాత్రే వరద చేరింది. దీంతో శిఖం భూమి పంటలు, వ్యవసాయ పరికరాలు మునిగిపోవడంతో పాటు వందలాంది మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. రూ. కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దీంతో రైతన్న ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. అదే సమయంలో జాతీయ విపత్తు నివారణ కమిటీ సభ్యులు నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులు నుంచి వివరాలు సేకరించి నష్ట పరిహారం అంచనా వేశారు. అయినా నేటికీ రైతులకు పరిహారం అందలేదు. ఈ పరిహారంపై రైతన్నలు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేసినా ఫలితం మాత్రం శూన్యం.

కూలీలుగా మారిన రైతులు

చెరువులో ఉన్న భూములు ఇప్పటి వరకూ నీటిలో ఉండి పోయాయి. దీంతో నాటి రైతులు నేడు ఉపాధి కోసం దినసరి కూలీగా మారారు. రావిర్యాల పరిసర ప్రాంతంలో ఉన్న పలు పరిశ్రమల్లో కూలీలుగా పని చేస్తున్నారు. చెరువులో ఉన్న నీరును తూముల ద్వారా బయటికి విడుదల చేస్తే తాము పంటలు సాగు చేసుకుంటామని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికీ రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులు కలిసి పలు మార్లు విజ్ఞప్తి చేశారు.

నీటిని వదలాలి



భారీ వర్షాల కారణంగా రాత్రికి, రాత్రే చెరువులోకి నీరు చేరడంతో పంటలు మునిగి, మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. కోట్ల రూపాయలు నష్టపోయాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వలేదు. అధికారుల స్పందించి చెరువులో నీరు బయటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే పంటలను సాగు చేసుకోగలము.

– తోడేటి గోవర్ధన్‌రెడ్డి, రైతు, రావిర్యాల

ముందస్తు చర్యలు చేపట్టండి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: వర్షాకాలం సమీపిస్తున్నందున ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్, సాయిసామ్రాట్‌నగర్ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరదనీరు కాలనీల్లో చేరుతోందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ, వర్షపునీటి అవుట్‌లేకపోవడంతో వర్షాలు పడినపప్పుడు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, అనిల్‌యాదవ్, డీఈ వెంకన్న, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, అర్కల కామేశ్‌రెడ్డి, మాదరి రమేశ్ తదితరులున్నారు.

వైకుంఠధామం నిర్మాణానికి వినతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో వైకుంఠధామం నిర్మించాలని 18వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు గుండు నర్సింగ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 20 వేల జనాభా ఉన్న శ్రీరాం కాలనీలో శ్మశాన వాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. గతంలో నిర్మించిన రెండు శ్మశాన వాటికలు పూర్తిగా కుచించుకుపోయి, నివాసాల నడుమకు మారాయాన్నారు. దీంతో అక్కడ అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందన్నారు. శ్మశాన వాటికకు ప్రభుత్వ స్థలం కేటాయించి వైకుంఠధామం నిర్మించాలన్నారు.



మీర్‌పేట: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

వరద కాల్వ కబ్జా

- అక్రమ నిర్మాణాలు చేపట్టిన రియల్ వ్యాపారులు
- చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



ఆముదాల చెరువు కాల్వను పరిశీలిస్తున్న రైతులు, గ్రామస్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని గొల్లూరులో ఆముదాల చెరువులోకి వెళ్లే వరద నీటి కాల్వను రియల్ వ్యాపారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆదివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గొల్లూరు–అమీర్‌పేట్ మార్గంలో ఆముదాల చెరువులోకి వెళ్లే కాల్వను మూసి చిన్న పైపులు వేసి అడ్డుగా నిర్మాణం చేపట్టండంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు చెరువులోకి వెళ్లకుండా రోడ్డుపై నిలిచిపోతున్నాయన్నారు. భగీరథగూడ తుమ్మల చెరువు, పులిమక్త మేళ్ల చెరువు, గొల్లూరు ఎర్రకుంట చెరువుల నుండి వచ్చే వరద నీరు ఆముదాల చెరువులోకి వెళ్లేదారులన్నీ మూసి నామామాత్రంగా చిన్న పైపులు వేసి కాంక్రీంట్‌తో నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వెంచర్ నిర్వాహకులు అముదాల చెరువులోకి వెళ్లే కాలువను వదిలేసి పక్కన నిర్మాణాలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చెరువు కాల్వ కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లూరు మాజీ సర్పంచ్ హరినాథ్‌గౌడ్, రైతులు సత్తయ్య, శ్రీనివాస్, యాదయ్య, దర్శన్, నర్సింహ, ప్రభు, బాబు తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాట యోధుడు సుందరయ్య



మహేశ్వరం: సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు



కందుకూరు: పార్టీ కార్యాలయంలో..

సీపీఎం మండల కార్యదర్శి రవికుమార్

మహేశ్వరం: రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టిన మహానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి అలువాల రవికుమార్ అన్నారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రవి కుమార్ మాట్లాడుతూ.. భూమి లేని పేదలకు అండగా ఉండి భూములు పంపిణీ చేశారని గుర్తు చేశారు. కుల వివక్ష వ్యతిరేకంగా దళితుల పక్షాన నిలిచి పోరాటాలు చేశారన్నారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీని గ్రామాల్లో విస్తరించిన ఘనత సుందరయ్యదే అన్నారు. విద్యార్థి, యువజన, రైతులు, మహిళలు, కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరు చేశారన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన మహా నాయకుడని.. ఆయన చేసిన సేవలు, పోరాటాలు చిరస్మరణీయమన్నారు. సుందరయ్య సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్, సీపీఎం నాయకులు పెంజర్ల జగన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కటికల శంకర్, నాయకులు కన్నయ్య, చెన్నయ్య, రవి, సాయి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

కందుకూరు: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. ధనిక కుటుంబలో పుట్టిన సుందరయ్య చివరి శ్వాస వరకు పేదల కోసమే పనిచేశారన్నారు. ప్రజల కోసమే కుటుంబ నియంత్రన ఆపరేషన్ చేయించుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, నాయకులు బుట్టి బాల్‌రాజు, అంకగళ్ల కుమార్, రాయికంటి శేఖర్, గాదె సత్తయ్య, ఈదాలు పాల్గొన్నారు.

మైసిగండి ఆలయంలో పూజలు



మైసిగండి అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ఆలయంలో ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాధవి దంపతులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు వెంకట్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, కేశవులు, జంగయ్య, భూపతిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీచ్యానాయక్ ఉన్నారు.

ఇంటర్మీడియెట్‌లో ఉచిత విద్య

ఇబ్రహీంపట్నం: కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు డీఆర్‌డీఏ ద్వారా 2024–25 సంవత్సరానికి గాను ఉచిత విద్య అందించనున్నారు. ఇబ్రహీంపట్నంలోని వాసవి జూనియర్ కాలేజీని డీఆర్‌డీఏ ఎంపిక చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకుల, కేజీబీవీ హాస్టల్స్‌లో చదివిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 7.0 జీపీఏకు పైగా గ్రేడ్ సాధించిన వారు అర్హులని డీఆర్‌డీఏ యాజమాన్యం తెలిపింది. ఎలాంటి ఫీజు చెల్లించకుండా ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరొచ్చని సూచించారు. వివరాలకు 6363008585 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని వాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

పొదుపు సంఘం రజతోత్సవం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పహాడీషరీఫ్: శ్రీ వినాయక పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం రజతోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో నిర్వహించారు. స్థానిక విజయ లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 25 ఏళ్లుగా విజయవంతంగా ముందుకు సాగుతున్న సంఘం విశేషాలపై చర్చించుకున్నారు. మున్ముందు సైతం పూర్తి పారదర్శకతతో కలిసి కట్టుగా ముందుకు సాగుతూ ఆర్థిక ప్రగతిని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘంలోని సభ్యులు మరణిస్తే రూ.21 వేల బీమా సదుపాయం కల్పించడంతో పాటు 60 ఏళ్లు నిండిన సభ్యులకు నెలకు రూ.1,500 చొప్పున ఇవ్వాలని తీర్మానించి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కెంచె లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు నల్ల భద్రమ్మ, సహాయ కార్యదర్శులు మనోజ్, రాంబాబు, కోశాధికారి ఎనగండ్ల శ్రీధర్ గౌడ్, పాలక వర్గ సభ్యులు మేకల మురళి, శిరీష, కరుణమ్మ, జర్పాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు పరిష్కారమేదీ?

- వర్షానికి కాలనీలు జలమయం
- శాశ్వత పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం



శనివారం కురిసిన వర్షానికి టెలిఫోన్ కాలనీ ప్రధాన రహదారిపై పారుతున్న వరద



అల్కాపురి చౌరస్తాలో పరిస్థితి

దిల్‌సుఖ్‌నగర్: దశాబ్దాలు గడుస్తున్నా వరద ముంపు సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదు.. చిన్న వర్షానికే కాలనీలు ముంపునకు గురి కావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నాయకుల హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో మలక్‌పేట జోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలు చిన్నపాటి వాన కురిసినా ముంపునకు గురి కావడం పరిపాటిగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు వర్షం నీరులో కలిసి కాలనీలను ముంచెత్తుతోంది.

నాలాల్లో పేరుకుపోయిన చెత్త

సరూర్‌నగర్, మలక్‌పేట, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని నాలాల్లో ఇంత వరకు పూర్తి స్థాయిలో చెత్తను తొలగించలేదు. దీనికి తోడు అభివృద్ధి పనుల పేరుతో ఈ వేసవిలో ఎక్కడిక్కడే రోడ్లను తవ్వి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. భారీ వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో జోన్ పరిధిలోని ముంపు కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు.

జనజీవనం అస్తవ్యస్తం

వర్షాకాలం వచ్చిందంటే మలక్‌పేట జోన్ పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట, సింగరేణి కాలనీ, ఆర్‌కే పురం డివిజన్లలోని పలు కాలనీలు, బస్తీలు, దిల్ సుఖ్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు గుండె దడ మొదలవుతుంది. గట్టి వర్షం వచ్చిందంటే ముంపు తప్పదని, జీవనం అస్తవ్యస్తమవుతుందని వారి భయం. వర్షా కాలం రాక ముందే డ్రైనేజీల్లో పూడిక తీయించాల్సిన అధికారులు కాలయాపన చేస్తుండటంతోనే వర్షం వచ్చిన ప్రతీసారి తమకు ముంపు ముప్పు తప్పడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

శాశ్వత పరిష్కారానికి డిమాండ్

వరద తాకిడి ఎక్కువగా ఉన్న కాలనీలకు ప్రత్యేక వరద నీటి కాలువలను నిర్మించి వాటి ద్వారా మూసీలోకి వరద నీరు వెళ్లేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే పనులు చేపట్టి వరద ముంపు సమస్య నుంచి తమకు శాశ్వత విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు

నందిగామ: శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. ఒగ్గు కళాకారుల ఆటాపాటలతో మండల పరిధిలోని వెంకమ్మగూడలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కళాకారుల ఆటపాటలు, పోతురాజుల నృత్యాలు శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలి పారు. కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ సర్పంచ్ రజనీతగౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపల్లి గ్రామంలో..

చేవెళ్ల: మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపుగా కనుల పండువగా సాగింది. గ్రామ పెద్దలందరూ ఉత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని పలు పార్టీల నాయకులు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవర వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు. వారికి గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు.



చేవెళ్ల: ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఒగ్గు పూజలు